

నాన్నే.. ప్రేరణ



- తండ్రి ప్రోత్సాహంతో ఐపీఎస్ సాధించిన ప్రేరణాకుమార్
- కుమార్తె చదువు కోసం రెండుసార్లు ప్రమోషన్ వదులుకున్న తండ్రి దీపక్‌కుమార్
- ఉత్తరప్రదేశ్‌లో చిన్న వయసులోనే ఐపీఎస్ సాధించిన మహిళగా రికార్డు
- తగిన ప్రోత్సాహం అందిస్తే ఏ రంగంలోనైనా మహిళలు రాణిస్తారు
- ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేరణాకుమార్



తల్లిదండ్రులు సుష్మారాణి, దీపక్‌కుమార్‌తో ప్రేరణాకుమార్ (ఫైల్ ఫొటో)

ప్రొద్దుటూరు క్రైం : కుమార్తెను ఉన్నతంగా చూడాలన్న తల్లిదండ్రుల ఆశయాలను ఆమె నెరవేర్చింది. తండ్రి మార్గదర్శకత్వంలో కఠోర సాధన చేసింది. ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకొని ముందుకు సాగింది. రోజుకు 8 గంటల పాటు కష్టపడి చదవడంతో విజయం ఆమె సొంతమైంది. 2018లో స్వరాష్ట్రం ఉత్తరప్రదేశ్‌లో అతి చిన్న వయసులోనే ఐపీఎస్ సాధించిన మహిళగా రికార్డు సృష్టించింది. ఆమే.. యువ ఐపీఎస్ అధికారి, ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేరణాకుమార్. అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.. ఆమె మాటల్లోనే..

ప్రజలకు సేవ చేసే అవకాశం వస్తుందని..

నా పేరు ప్రేరణాకుమార్. నేను పుట్టి పెరిగింది ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ఘజియాబాద్‌లో. నాన్న దీపక్ కుమార్ ఇన్‌కంట్యాక్స్ గ్రేడ్ సీ ఉద్యోగం చేసేవారు. అమ్మ సుష్మారాణి గృహిణి. నాకు ఒక అన్నయ్య ఉన్నాడు. ప్రతీక్‌కుమార్. ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఉన్నతమైన ఉద్యోగాలు, గొప్ప గొప్ప చదువులకు మా ప్రాంతం చాలా ప్రసిద్ధి చెందింది. అలాంటి వాతావరణంలో నేనూ పెరిగాను. చదువు విషయంలో చిన్నప్పటి నుంచి నాన్న నా పట్ల శ్రద్ధ చూపిస్తూ వచ్చారు. సివిల్ సర్వీసెస్ ఆఫీసర్ అయితే ప్రజలకు నేరుగా సేవ చేసే అవకాశం ఉంటుందని నూరిపోశారు. నా పాఠశాల, కళాశాల విద్య ఘజియాబాద్‌లోనే పూర్తి చేశాను. రాజస్థాన్‌లోని వనస్థలి యూనివర్సిటీ నుంచి 2016లో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగంలో బీటెక్ పూర్తి చేశాను. అటు తర్వాత సివిల్స్ ప్రిపరేషన్‌పై దృష్టి సారించాను.

రోజూ 45 కిలోమీటర్లు ప్రయాణించి..

సివిల్ సర్వీసెస్ సాధించడంలో భాగంగా డిల్లీలోని ఒక కోచింగ్ సెంటర్‌ను ఎంచుకున్నాను. ఘజియాబాద్ నుంచి సుమారు 45 కిలోమీటర్లు ఉంటుంది. ప్రతి రోజు మెట్రోలో ప్రయాణించి అక్కడికి వెళ్లేదాన్ని. మీకు ఇంకో విషయం చెప్పాలి. కోచింగ్ పైనే నేను పూర్తిగా ఆధార పడలేదు. సెల్ఫ్ స్టడీస్‌పై ఎక్కువ దృష్టిసారించాను. ఇంటర్నెట్‌లో కూడా యూపీఎస్సీకి సంబంధించిన సమాచారం ఎక్కువగా లభించేది. అవసరమైన మెటీరియల్‌ను పోస్టు ద్వారా తెప్పించుకుంటూ ప్రిపేర్ అయ్యాను. రోజు 6 –7 గంటలు చదివాను. యూపీఎస్సీ పరీక్షలు దగ్గర పడేకొద్దీ 8–10 గంట లు చదుతూ వచ్చాను. చివరకు 2017లో పరీక్ష రాసి 2018లో పాసయ్యాను. ఐఏఎస్ కావాలనుకున్నా కానీ.. ఐపీఎస్ వచ్చింది. ఐఏఎస్, ఐపీఎస్ రెండింటి లక్ష్యం ప్రజాసేవ చేయడమే. అందుకే సంతోషంగా శిక్షణ తీసుకున్నా. 2019 లో ఐపీఎస్ ట్రైనింగ్ పూర్తి చేశాను. మొదటి పోస్టింగ్ విశాఖపట్టణంలో గ్రేహౌండ్స్ అసాల్ట్ కమాండర్‌గా చేశాను. అక్కడి నుంచి బదిలీపై ప్రొద్దుటూరుకు వచ్చాను.

నాన్న ప్రమోషన్ వదులుకున్నారు

మా నాన్నకు రెండుసార్లు ప్రమోషన్ వచ్చింది. ప్రమోషన్ తీసుకుంటే దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని, దీనివల్ల నా చదువుకు అంతరాయం కలుగుతుందని ఆయన భావించారు. నా కెరీర్‌ను చక్క బెట్టేందుకు ఆయన ప్రమోషన్‌ను త్యాగం చేశారు. అన్నయ్య, అమ్మా నాతో ఒక పనీ చేయించేవారు కాదు. అన్ని పనులు వాళ్లే చూసుకునేవాళ్లు. వారి ప్రోత్సాహంతో నా స్టడీస్‌పై ఎక్కువ ఫోకస్ పెట్టగలిగాను. సివిల్స్ పాస్ అయ్యానని తెలిసి నాన్నతో పాటు కుటుంబ సభ్యులు, బంధువులు చాలా సంతోషపడ్డారు. ఆ సమయంలో నాన్న కళ్లలో ఆనందం చూశాను. ఆయన పడ్డ కష్టానికి ప్రతిఫలం లభించడంతో ఆనంద భాష్పాలతో నా కళ్లు చెమర్చాయి.

పట్టుదలతో విజయం సాధ్యమే

పట్టుదల, నిబద్ధతతో చదివితే విజయం తప్పక వరిస్తుంది. తగిన ప్రోత్సాహం అందిస్తే అమ్మాయిలు ఏ రంగంలోనైనా రాణించగలరు. సివిల్స్ వైపు వెళ్లాలనుకునే వారికి ఇంటర్నెట్‌లో పూర్తి సమాచారం లభిస్తుంది. అవసరమైన స్టడీ మెటీరియల్ కూడా పోస్టు ద్వారా తెప్పించుకోవచ్చు.



కోచింగ్ తీసుకున్నా సెల్ఫ్ స్టడీస్‌పైనే ఎక్కువ దృష్టి సారించాలి. ఫోకస్ అంతా పరీక్షలపైనే పెట్టాలి. ప్రణాళిక ప్రకారం చదువు సాగిస్తే అనుకున్నది సాధించవచ్చు. పుస్తకాలు చదవడం, బ్యాడ్మింటన్ నాకెంతో ఇష్టం. గతేడాది డిసెంబర్‌లో 2018 బ్యాచ్‌కు చెందిన బీహార్ ఐపీఎస్ ఆఫీసర్ హిమాన్షుతో నాకు వివాహం అయింది. మన జిల్లా ఎస్పీ అన్బురాజన్ సహకారం నేను మరువలేను. విధి నిర్వహణలో నన్ను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తున్నారు. ప్రొద్దుటూరులో పని చేయడం గొప్ప అనుభూతిని ఇస్తోంది. ఇక్కడి ప్రజలు చాలా మంచివారు. పోలీసులకు బాగా సహకరిస్తారు.

వనితా.. వందనం



రాత్రీపగలు లేదు.. తిండితిప్పలు వగైరా సరిగా లేవు.. అయినా మహిళలు అన్నింటా తామై కనిపిస్తున్నారు. అన్ని పనుల్లో మగమహారాజులకు దీటుగా నిలుస్తున్నారు. జీవనసమరంలో గెలుస్తున్నారు. కడప నగరంలో మంగళవారం కనిపించిన దృశ్యాలివి.

– ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, కడప.









న్యూస్‌రీల్

డీఈఓగా రాఘవరెడ్డి



కడప ఎడ్యుకేషన్: వైఎస్సార్ జిల్లా విద్యాశాఖాధికారిగా రాఘవరెడ్డిని ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం ఈయన అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారిగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం వైఎస్సార్ జిల్లా విద్యాశాఖాధికారిగా పనిచేస్తున్న దేవరాజు మోడల్ స్కూల్ ఏడీగా వెళ్లనున్నట్లు తెలిసింది.

ఏఎఫ్‌యూ పరీక్షా ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ అంజనేయప్రసాద్

ఏఎఫ్‌యూ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో కాలేజ్ ఆఫ్ ఫైన్‌ఆర్ట్స్‌కు చెందిన (ఆర్21) మూడో సెమిస్టర్ పరీక్షా ఫలితాలను మంగళవారం వీసీ ఆచార్య బానోతు ఆంజనేయ ప్రసాద్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్ రెడ్డి, సూపరింటెండెంట్ వై.పవన్‌కుమార్‌రెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఇ.సి.సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

‘ఫెస్టివల్ ఆఫ్ లెటర్స్’కు వేంపల్లె గంగాధర్



కడప కల్చరల్ : కథా రచయిత డాక్టర్ వేంపల్లె గంగాధర్‌కు న్యూఢిల్లీలో కేంద్ర సాహిత్య అకాడమి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఫెస్టివల్ ఆఫ్ లెటర్స్ కార్యక్రమంలో పాల్గొనాలంటూ ఆహ్వానం అందింది. మార్చి 11 నుంచి 16వ తేదీ వరకు జరగనున్న జాతీయ సాహితీ సదస్సులో ఆయన పాల్గొననున్నారు. మార్చి 11న జరగనున్న వివిధ ప్రాంతీయ భాషల కథల ఆవిష్కరణ కార్యక్రమలో వేంపల్లె గంగాధర్ తెలుగు కథా విభాగంలో తన కథ వినిపించనున్నారు.

వైవీయూ ఆధునిక వెబ్‌సైట్ ప్రారంభం

వైవీయూ: ఆధునికీకరించిన వైవీయూ వెబ్‌సైట్‌ను వైస్ చాన్సలర్ ఆచార్య జింకా రంగజనార్దన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీపీ బ్రౌన్ గురించి, గ్రంథాలయ ఆవిర్భావం తదితరాల గురించి.. అలాగే వైవీయూ అనుబంధ కళాశాలలకు సంబంధించిన సర్క్యులర్‌లు, సిలబస్ తదితర వివరాలు వైవీయూ.ఈడీయూ.ఇన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచామన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల పౌర్ణమీ కల్యాణం



సీతారాములకు కల్యాణ తంతు నిర్వహిస్తున్న అర్చకులు

ఒంటిమిట్ట: ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలో మంగళవారం పౌర్ణమి సందర్భంగా ఉదయం 10 గంటలకు సీతా సమేతుడైన శ్రీ కోదండ రాముడి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని కల్యాణ వేదిక వద్ద అర్చకులు ఉత్సవమూర్తులను వేర్వేరుగా ఉంచారు. సుగంధ ద్రవ్యాలతో పాటు పాలు, పెరుగు, తేనె, నెయ్యి, కొబ్బరినీళ్లతో అభిషేకాలు నిర్వహించి.. నూతన పట్టువస్త్రాలు ధరింపజేసి, తులసి గజమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయ అర్చకులు అంగరంగ వైభవంగా పౌర్ణమి కల్యాణం నిర్వహించారు.

పక్కాగా బ్రహ్మోత్సవ పనులు

శ్రీ కోదండ రామస్వామి బ్రహ్మోత్సవాల పనుల ఏర్పాట్లపై రాజీ పడేది లేదని టీటీడీ చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు అన్నారు. ఒంటిమిట్టలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలు ప్రారంభం కావడానికి ఇక 23 రోజులు మాత్రమే ఉన్నాయని, పనులు నాణ్యతతో పూర్తి చేయాలని బాధ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ డీఈ రామ్మూర్తి, టీటీడీ విద్యుత్ విభాగం డీఈ చంద్రశేఖర్, ఎస్ఈ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పటిష్ట బందోబస్తు: కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని కడప డీఎస్పీ వెంకట శివారెడ్డి అన్నారు. మంగళవారం ఏర్పాట్లను పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కల్యాణ వేదిక వద్ద అన్నప్రసాదాలు, ముత్యాల తలంబ్రాల కౌంటర్లను పరిశీలించామన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా వాహనాల మళ్లింపు చేపడతామన్నారు. ఆయన వెంట సీఐ పురుషోత్తం రాజు, ఎస్ఐ మధుసూదన్‌రావు తదితరులున్నారు.

ఆధార్‌ను అప్‌డేట్ చేసుకోండి

కడప సిటీ : జిల్లాలో 2010 నుంచి 2018 మధ్య, తర్వాత ఆధార్ కార్డు పొందినవారు ప్రతి పదేళ్లకొకసారి నవీకరణ (అప్‌డేట్) తప్పనిసరిగా చేసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) గంగాధర్ గౌడ్ తెలిపారు. ఈ అంశంపై ప్రజలకు అవగాహన కల్పించి అప్‌డేట్ చేసుకునేలా చైతన్యపరచాలని అధికారులకు సూచించారు. మంగళవారం డీఆర్వో తన చాంబర్‌లో జిల్లా స్థాయి ఆధార్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు వయసున్న వారి ఆధార్ నమోదు, అప్‌డేట్ వంద శాతం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. పుట్టిన పిల్లలకు ఆధార్ పొందేలా ప్రభుత్వ, ప్రయివేట్ ఆస్పత్రుల్లో చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో ఆధార్ ప్రక్రియ పూర్తికి కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని సూచించారు. 15 సంవత్సరాల లోపు పిల్లలకు ఆధార్ అప్‌డేట్ ఉచితంగా రెండుసార్లు చేయవచ్చని, విద్యా సంస్థలతో సమన్వయం చేసుకుని కార్యక్రమం పూర్తి చేయాలన్నారు. ఈ అవకాశం మార్చి 31 వరకు ఉంటుందన్నారు. వివరాల కోసం టోల్ ఫ్రీ నంబర్ 1947ను సంప్రదించవచ్చన్నారు.

భక్తిశ్రద్ధలతో షబ్బేబరాత్



విద్యుద్దీప కాంతులతో ముస్తాబైన మసీదు

కడప కల్చరల్ : పవిత్ర రంజాన్ ఆగమనాన్ని తెలియజేస్తూ షబ్బే బరాత్ (బడీ రాత్) పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో మంగళవారం ముస్లింలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా జిల్లావ్యాప్తంగా అన్ని ప్రధాన మసీదులను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించడంతో పండుగ కళ కనిపించింది. ముస్లింలు నూతన వస్త్రాలు ధరించి పరిమళ ద్రవ్యాలతో సమీపంలోని మసీదులకు వెళ్లి ప్రార్థనలు చేశారు. రాత్రి ఇషా నమాజ్ తర్వాత తమ పాపాలు క్షమించబడే గొప్ప రాత్రిగా భావిస్తూ అల్లాహ్‌ను వేడుకున్నారు. అన్ని మసీదుల్లో మత గురువులు, ఆధ్యాత్మిక ప్రసంగీకుల ఆధ్వర్యంలో పవిత్ర రాత్రి విశిష్టత గురించి వివరించారు. దీంతో పాటు రానున్న పవిత్ర మాసం గొప్పతనాన్ని, అందుకు సంబంధించి నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. కాగా, ఈ పవిత్ర రాత్రి నిర్వహణకు సంబంధించి మసీదు కమిటీల ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలైన నమాజ్, జికర్, పవిత్ర ఖురాన్ పఠనం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. బుధవారం తెల్లవారుజామున ఫజర్ నమాజ్ తర్వాత తమ దివంగతుల పెద్దల సమాధుల వద్దకు వెళ్లి పాపాలను క్షమించాలని దైవాన్ని కోరుతూ ప్రార్థనలు నిర్వహించారు.

సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎన్నికల ఆర్ఓ, కలెక్టర్ నాగలక్ష్మి, చిత్రంలో జేసీ కేతన్‌గార్గ్, డీఆర్ఓ గాయత్రీదేవి

అనంతపురం అర్బన్: ‘పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి సమస్మాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలి. ఆయా కేంద్రాల్లో తప్పనిసరిగా వీడియో చిత్రీకరణ చేయాలి’ అని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, అనంతపురం కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులకు సూచించారు. పోలింగ్ నిర్వహణపై మంగళవారం ఆమె కలెక్టరేట్ నుంచి శ్రీ సత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల జిల్లాల జాయింట్ కలెక్టర్లు, డీఆర్‌ఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు, పోలింగ్ సామగ్రి నిర్వహణ, పంపిణీ, అధికారులు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు, ఇలా ప్రతి అంశంపైన అధికారులకు స్పష్టమైన విధివిధానాలను ఎన్నికల కమిషన్ రూపొందించిందన్నారు. ఇందుకు అనుగుణంగా అధికారులు, సిబ్బంది పనిచేయాలన్నారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నిబంధనల ఉల్లంఘన ఏ స్థాయిలోనూ జరగకుండా అప్రమత్తతతో విధులు నిర్వర్తించాలని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేవారికి వీలైనంత ముందుగానే పోస్టల్ బ్యాలెట్ పేపర్ అందించాలన్నారు. 800 మంది ఓటర్లున్న పోలింగ్ కేంద్రంలో జంబో బ్యాలెట్ పెట్టి వినియోగించాలని సూచించారు. పోలింగ్ రోజున కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఉండేలా చూడాలన్నారు. పోలింగ్ విధుల్లోని అధికారులు, సిబ్బందికి వసతి, భోజన సదుపాయం, కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలని చెప్పారు. ఏ చిన్న పొరపాటుకు తావివ్వకుండా పోలింగ్ సజావుగా జరిగేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు.

సూక్ష్మ పరిశీలకుల పాత్ర కీలకం





సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి, హాజరైన సూక్ష్మ పరిశీలకులు

కడప సిటీ: శాసన మండలి ఎన్నికల్లో పోలింగ్ నియమావళి అమలులో సూక్ష్మ పరిశీలకుల పాత్ర ఎంతో కీలకమని కడప ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి తెలిపారు. కడప కలెక్టరేట్‌లోని సభా భవనంలో ఎమ్మెల్సీ ఎన్నికల విధులు నిర్వహించడానికి నియమించిన 196 మంది సూక్ష్మ పరిశీలకులకు (మైక్రో అబ్జర్వర్లు) మంగళవారం ఆర్డీఓ అధ్యక్షతన ఒక రోజు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఈ నెల 13న జరుగనున్న పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ పోలింగ్ నేపథ్యంలో 38 ఎమ్మెల్సీ టీచర్స్ పోలింగ్ కేంద్రాలు, 93 పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు జరుగనున్నాయని తెలిపారు. ఎన్నికలను సజావుగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా జరిపేందుకు ఈ శిక్షణా కార్యక్రమం నిర్వహించామన్నారు. ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. విధుల్లో అలసత్వం వహించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి ప్రభాకర్ రెడ్డి, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి దీప్తి తదితరులు పాల్గొన్నారు.

రేపు ఫెన్సింగ్ జట్ల ఎంపిక

రాజంపేట టౌన్: రాజంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలోని ఇండోర్ స్టేడియంలో గురువారం ఉదయం 10 గంటల నుంచి ఉమ్మడి వైఎస్సార్‌జిల్లా ఫెన్సింగ్ జట్లను ఎంపిక చేయనున్నట్లు ఆ క్రీడ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఏ.చంద్రకళావతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు 9490863918 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

వివాహిత ఆత్మహత్య

మైదుకూరు : మైదుకూరు పట్టణంలోని వెంకటసుబ్బయ్య కాలనీకి చెందిన జ్యోతి (18) అనే వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. సోమవారం రాత్రి విషపు గుళికలు మింగడంతో చికిత్స కోసం ప్రొద్దుటూరు ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో కడపలోని రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు అర్బన్ ఏఎస్ఐ చంద్ర మౌళి తెలిపారు. కడప నగర పరిధిలోని అలంఖాన్‌పల్లె దండు ప్రాంతానికి చెందిన దాసరి జ్యోతి, వెంకటసుబ్బయ్య కాలనీకి చెందిన జగన్నాథం అశోక్ ఆరు నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. సోమవారం భార్యభర్తలు గొడవపడటంతో జ్యోతి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. మృతురాలి తల్లి నాగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

ఖాతాలోని నగదు మాయం

కలసపాడు : మండలంలోని ఎగువ తంబళ్లపల్లెకు చెందిన మాజీ మండల ఉపాధ్యక్షురాలు కొండాలక్ష్మీనరసమ్మ తన ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఖాతాలోని రూ.70 వేలు నగదు మాయమైందని మంగళవారం ఎగువ రామాపురం ఏపీజీబీ బ్యాంకు మేనేజర్ వినోద్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. తన ప్రమేయం లేకుండా తన ఖాతా నుంచి నగదు ఎవరు తీశారనే దానిపై విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. ఈ విషయంపై బ్యాంకు మేనేజర్‌ను వివరణ కోరగా ఖాతాలో నగదు మాయమైంది వాస్తవమేనని, ఈ విషయం ఏపీజీబీ ఆర్ఎం దృష్టికి తీసుకెళ్లామన్నారు. విచారణ జరిపి బాధితురాలికి న్యాయం చేస్తామని ఆయన తెలిపారు.

ఘనంగా నీలకంఠ్రావుపేట ఉరుసు

రామాపురం : రామాపురం మండలం నీలకంఠ్రావుపేట సమీపంలోని సద్గురు హజరత్ దర్బార్ అలీషా వలి, రహమతుల్లా ఆల్లై బాబా, జలీల్ మస్తాన్ వలీ గార్ల ఉరుసు ఉత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. ప్రత్యేకంగా ఈ ఉరుసు ఉత్సవాలలో భాగంగా రాత్రికి జెండా ప్రదర్శన, బెంగళూరు, బొంబాయిలకు చెందిన అస్మాని, ఖలీల్ సైదాలతో ఖవ్వాలీ పోటీ నిర్వహించారు. ఉరుసుకు వచ్చిన భక్తులందరికీ అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తులు తమ మొక్కులలో భాగంగా దర్గాలో జెండాలు, తలనీలాలు సమర్పించారు.

శభాష్ 'మహిళా పోలీస్'!

వైఎస్సార్ జిల్లాలో వివిధ సబ్ డివిజన్‌ల పరిధిలో పనిచేస్తున్న మహిళా పోలీసుల వివరాలు	
సబ్ డివిజన్ పేరు	పనిచేస్తున్న మహిళా పోలీసులు
కడప	213
పులివెందుల	68
ప్రొద్దుటూరు	95
జమ్మలమడుగు	93
మైదుకూరు	161
వైఎస్సార్ జిల్లాలో మొత్తం మహిళా పోలీసులు 630	

- అసాంఘిక కార్యకలాపాల కట్టడిలో మహిళా పోలీసుల కీలక పాత్ర
- బహిరంగ మద్యపానం, నిషేధిత గుట్కా, మట్కా, గ్యాంబ్లింగ్‌లపై నిఘా
- తక్షణం రంగంలోకి దిగి అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతున్న పోలీసులు



కడప అర్బన్ : జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలైన మట్కా, గుట్కా, క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్ నిరోధానికి మహిళా పోలీసులు కీలకపాత్ర పోషిస్తున్నారు.తాము విధులు నిర్వర్తించే వార్డులు, గ్రామ సచివాలయాల పరిధిలో జరిగే చట్ట వ్యతిరేక కార్యక్రమాలపై నిరంతర నిఘా కొనసాగిస్తున్నారు. ఇటీవలి కాలంలో జిల్లాలో బహిరంగ మద్యపానం, ధూమపానంపై జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పలు స్టేషన్‌ల పరిధిలో కేసులు నమోదు చేశారు. అంతేగాకుండా అసాంఘిక కార్యకలాపాలను ఉక్కుపాదంతో అణచి వేయడంలో మహిళా పోలీసులను భాగస్వాములను చేశారు. బహిరంగ మద్యపానం, ధూమపానంపై వాట్సాప్ ద్వారా సంబంధిత పోలీసు అధికారులకు చేరవేస్తూ, అప్రమత్తం చేస్తూ బ్లూకోల్ట్స్, వైట్ కోల్ట్స్ రంగంలోకి దిగి మందుబాబులు, పొగరాయుళ్ల ఆట కట్టిస్తున్నారు. మహిళల భద్రతకు ప్రమాదకరంగా మారి మహిళలు సంచరించేందుకు సమస్యలున్న ప్రాంతాలను గుర్తించి పోలీసుల గస్తీ ముమ్మరం చేసేలా, తద్వారా ఆకతాయిల ఆట కట్టించేందుకు కృషి చేస్తున్నారు. మరోవైపు సామాజిక చైతన్య కార్యక్రమాల్లో భాగస్వాములు కావడంతో పాటు బాల్యవివాహాలను అడ్డుకునేందుకు, గృహహింసను నివారించేందుకు స్త్రీలు, పిల్లల అక్రమ రవాణాను నిరోధించేందుకు ఆయా వార్డులు, గ్రామ సచివాలయాల పరిధిలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.



కడపలో 'దిశ' మహిళా అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్

■ 'దిశ' కో–ఆర్డినేటర్లతో, మహిళా మిత్రలతో సమన్వయం చేసుకుంటూ వారి పరిధిలోని మహిళల సమస్యలు తెలుసుకుంటూ ఆత్మీయంగా పలకరిస్తూ మహిళల అంతరంగాన్ని, వారి ఆవేదనను అర్థం చేసుకుంటున్నారు. దీంతోపాటు వారికి తగిన సలహాలు సూచనలు ఇస్తూ వారికి పోలీసుశాఖ అండగా ఉందనే భరోసా కల్పిస్తున్నారు. మహిళలకు సంపూర్ణ భద్రత, భరోసా కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు.

'దిశ' యాప్‌పై అవగాహన

మహిళల భద్రతకు రక్షణ కవచం లాంటి 'దిశ'యాప్ ఉపయోగాలను వివరించడంలో, వినియోగించడంలో మహిళలకు అవగాహన కల్పిస్తూ జిల్లాలో ప్రతి మహిళ 'దిశ'యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకునేలా మహిళా పోలీసులు కృషి చేస్తున్నారు. ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా 1,11,45,339 మంది, వైఎస్సార్ జిల్లాలో 4,89,367 మందికిపైగా మహిళలు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారు.

మహిళలు, పిల్లల కష్టాలను దూరం చేసేందుకు కృషి



సమాజంలో మహిళలు, పిల్లలు పడుతున్న కష్టాలను దూరం చేసేందుకే ప్రతి మహిళా పోలీస్ కృషి చేస్తున్నారు. పాఠశాలల్లో విద్యార్థినులకు 'గుడ్ టచ్, బ్యాడ్ టచ్'ల గురించి వివరించడం, 'దిశ'యాప్ ప్రాధాన్యతను వివరించడం చేస్తున్నాం. బాల్యవివాహాలను నివారించేందుకు కృషి చేస్తున్నాం. వారి తల్లిదండ్రులను ఒప్పించి, వారి వద్ద నుంచి హామీ పత్రాలను తీసుకుంటున్నాం. బాల్యవివాహాల వలన జరిగే నష్టాలను వివరిస్తున్నాం.

– కె. వసంతలక్ష్మి, మహిళా పోలీస్, శంకరాపురం-1, కడప

వృద్ధాప్య దశలో తల్లిదండ్రులను చూసుకునేలా కృషి చేస్తున్నాం



కొందరు తమ తల్లిదండ్రులను వృద్ధాప్య దశలో సరిగా చూసుకోకపోయినా వారికి అవగాహన కల్పించడంతో పాటు, బాగా చూసుకునేలా కృషి చేస్తున్నాం. అసాంఘిక కార్యకలాపాలైన మట్కా, గ్యాంబ్లింగ్, క్రికెట్ బెట్టింగ్, తదితర చట్ట వ్యతిరేక కార్యకలాపాలను నియంత్రించేందుకు కృషి చేస్తున్నాం.

– బి. మంజూష, మహిళా పోలీస్, అలంఖాన్‌పల్లి- 2 సచివాలయం, కడప

అసాంఘిక కార్యకలాపాల నియంత్రణలో కీలక పాత్ర



సమాజంలో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలను నియంత్రించడంలో స్థానికంగా పోలీస్ అధికారులకు సమాచారం ఇవ్వడం, వాటిని నిర్మూలించేందుకు మహిళా పోలీసులు కృషి చేస్తున్నారు. మహిళలు, చిన్నారులపట్ల నేరాలు జరిగినప్పుడు ఆయా సంఘటనల విచారణలో మహిళా పోలీసులు సంపూర్ణంగా సహకరిస్తున్నారు.

– రెడ్డివారి వాసుదేవన్, డీఎస్పీ 'దిశ' మహిళా అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్, కడప

పోలీసు శాఖ ప్రతిష్టను పెంచుతున్నారు



మహిళా పోలీసు వ్యవస్థ ద్వారా ఎన్నో నేరాలను పోలీసుశాఖ నియంత్రించగలుగుతోంది. బాలబాలికలను కార్మికులుగా మారుస్తున్న తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ చైతన్య వంతులుగా తీర్చిదిద్ది వారి పిల్లలను చదివించేలా కృషి జరుగుతోంది. 'దిశ'యాప్ ప్రాధాన్యతపై అవగాహన కల్పిస్తూ డౌన్‌లోడ్ చేయించడం, వినియోగించడం లాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. దూరప్రాంతాలనుంచి 'స్పందన'కు వచ్చే అవకాశం లేని వారి నుంచి మహిళా పోలీసులే ఫిర్యాదులను స్వీకరించి, సంబంధిత సచివాలయం ద్వారా వీడియో కాన్ఫరెన్స్‌లో నాతో సంప్రదించి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు. మహిళా పోలీసులు తమ వృత్తి నైపుణ్యంలో ముందుకు వెళ్లాలని ప్రోత్సహిస్తూ వారికి ప్రశంసాపత్రాలతో పాటు అవార్డులను అందిస్తున్నాం.

– కేకేఎన్ అన్బురాజన్, జిల్లా ఎస్పీ, కడప

ఘనంగా గంధోత్సవం

దువ్వూరులో ప్రారంభమైన జమాల్‌వలీ ఉరుసు

దువ్వూరు : మండలంలోని కృష్ణంపల్లెలో మంగళవారం జమాల్ వలి స్వామి ఉరుసు సందర్భంగా గంధోత్సవం ఘనంగా నిర్వహించారు. గంధం, పూల దుప్పట్లను నిర్వాహకుల ఇంటి నుంచి మంగళ వాయిద్యాలతో దర్గాకు తీసుకొచ్చారు. స్వామికి ప్రత్యేక ప్రార్థనలు చేసి చక్కెర చదివింపులు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామి సమాధిని దర్శించుకున్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఆసక్తికరంగా బండలాగుడు పోటీలు

ఉరుసు సందర్భంగా మంగళవారం ఎద్దులకు బండలాగుడు పోటీలను జెడ్పీటీసీ మేరువ కృష్ణయ్య ప్రారంభించారు. ఈ పోటీలను ఆసక్తిగా ప్రజలు తిలకించారు. ఈ పోటీల్లో చెన్నూరు మండలం రాచిన్నాయపల్లెకు చెందిన పసుపుల బాబయ్య ఎద్దులు ప్రథమ బహుమతి రూ.30,116, రెండో బహుమతి రూ.20,116 ఆళ్లగడ్డ మండలం పెద్దకందుకూరుకు చెందిన విజయకుమార్ ఎద్దులు, మూడో బహుమతి రూ.10,116 ప్రొద్దుటూరుకు చెందిన పసుపుల శశికుమార్ ఎద్దులు, నాలుగో బహుమతి రూ.5,116 ప్రొద్దుటూరుకు చెందిన పుల్లా నారాయణ రెడ్డి ఎద్దులు గెలుపొందాయి. ఈ పోటీల్లో గెలుపొందిన ఎద్దుల యజమానులకు నిర్వాహకులు నగదు బహుమతులు అందించారు.


బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు మేరువ కృష్ణయ్య

నేడు వైభవంగా ఉరుసు

జమాల్ వలి స్వామి ఉరుసు బుధవారం వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. అన్నదాన కార్యక్రమం ఉంటుందని చెప్పారు. రాత్రి 8.30 గంటలకు సత్యహరిశ్చంద్ర నాటకాన్ని ప్రదర్శిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.


జమాల్‌వలి స్వామి సమాధిని దర్శించుకుంటున్న భక్తులు

బస్సుల కొనుగోలుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

హర్షం వ్యక్తం చేసిన ఆర్టీసీ చైర్మన్



కడప కోటిరెడ్డిసర్కిల్ : రాష్ట్ర వ్యాప్తంగా 2736 బస్సుల కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వీటిలో 1500 డీజిల్ బస్సులు, 1000 ఎలక్ట్రానిక్ బస్సుల కొనుగోళ్లకు అనుమతులు లభించాయి. అలాగే 200 డీజిల్‌తో నడుస్తున్న బస్సులు ఎలక్ట్రానిక్ బస్సులుగా మార్పు చేయనున్నారు. అలాగే పట్టణ ప్రాంతాల్లో 15 మీటర్ల అంబారి బస్సులను కొనుగోలు చేయనున్నారు. అలాగే అంతర్ రాష్ట్ర సర్వీసులపై కీలక ఒప్పందాలను అమలు చేయనున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొత్త బస్సుల కొనుగోలుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వంతో ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం తన కార్యాలయంలో ఈ మేరకు విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్టీసీ సంస్థ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించారన్నారు. భారతదేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా రాష్ట్రంలో ఏపీఎస్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి ఉద్యోగుల కుటుంబాల్లో వెలుగులు నింపారన్నారు. అదే చొరవతోనే కొత్త బస్సుల కొనుగోలుకు కూడా అనుమతులు ఇవ్వడంతో చరిత్రలో ఆయన నిలిచిపోతారని వివరించారు.

ఘనంగా మొల్ల సాహితీ జయంతి ఉత్సవాలు

గోపవరం : మొల్ల సాహితీ జయంతి ఉత్సవాలు మంగళవారం మొల్ల జన్మస్థలి గోపవరంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. మొల్ల ఆరాధించిన రామాలయంలో విశేష పూజలు చేసి మొల్ల మందిరంలోని మహాకవయిత్రి మొల్ల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆమె సాహితీ సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మొల్ల సాహితీపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు మాట్లాడుతూ కవయిత్రులకు కూడా కడప పుట్టినిల్లు అని, తాళ్లపాక తిమ్మక్క, మొల్లమాంబ, పుట్టపర్తి కనకమ్మ, గంటి క్రిష్ణవేణమ్మ తదితరులు ఈ గడ్డపై జనిృంచడం మనం చేసుకున్న గొప్ప అదృష్టమన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బద్వేలు డివిజన్ ఎంపీఐ శేఖర్‌రావు మాట్లాడుతూ స్త్రీలు అబలలు కాదు సబలలు అని మొల్ల తన రామాయణం ద్వారా నిరూపించారన్నారు. బద్వేలు పెన్షనర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ మీనాక్షిరెడ్డి, బ్రహ్మయ్యలు మాట్లాడారు. అనంతరం రచయితలు రాఘవరాజు, స్వర్ణలత దంపతులను నగదు పారితోషికం, మొల్ల జ్ఞాపికతో సత్కరించారు.


రచయితలు రాఘవరాజు దంపతులను సన్మానిస్తున్న సాహితీపీఠం అధ్యక్షుడు, అతిథులు

రసవత్తరంగా బండలాగుడు పోటీలు

వల్లూరు : మండల పరిధిలోని మాచిరెడ్డిపల్లెలో లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన బండలాగుడు పోటీలు అట్టహాసంగా జరిగాయి. నిర్వాహకులు పుత్తా నరసింహారెడ్డి బండలాగుడు పోటీలను ప్రారంభించారు. జంగంపల్లెకు చెందిన నాగసుబ్బారెడ్డి ఎద్లు అత్యధికంగా 2503 అడుగులు రాతి దూలాన్ని లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. అలాగే నంద్యాల జిల్లాకు చెందిన అనుషారాణి, చక్రవర్తిగౌడ్‌కు చెందిన ఎద్లు 2406 అడుగులతో ద్వితీయ స్థానంలో, పెద్దచీపాడుకు చెందిన సాయి స్వామి, గొల్లపల్లెకు చెందిన రాంచరణ్ ఎద్లు 2176 అడుగులతో తృతీయ స్థానంలో నిలిచాయి. నంద్యాల జిల్లా రోళ్లపాడుకు చెందిన పేరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఎద్లు 2117 అడుగులతో నాల్గవ స్థానంలో నిలిచాయి. గోపవరానికి చెందిన నేలమయ్య ఎద్లు 2100 అడుగులతో 5వస్థానం, ఎర్రగుంట్లకు చెందిన శృతి ప్రియ ఎద్లు 6వ స్థానంలో నిలిచాయి. వారికి నిర్వాహకులు వరుసగా రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేలు నగదు బహుమతులు అందజేశారు. పాలపళ్ల బండలాగుడు పోటీల్లో తలపనూరు గంగిరెడ్డి, చిన్ననాగిరెడ్డి పల్లె తరకరెడ్డి ఎద్లు 4504 అడుగులు రాతి దూలాన్ని లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. అలాగే 4008 అడుగులతో ఎర్రగుంట్లకు చెందిన రాము ఓబుల్‌రెడ్డి ఎద్లు ద్వితీయ స్థానంలో, ఖాదర్‌ఖాన్ కొట్టాలుకు చెందిన భావనశ్రీ ఎద్లు 3979 అడుగులతో తృతీయ స్థానంలో, తొండూరుకు చెందిన పార్ల సుబ్బారెడ్డి ఎద్లు 3900 అడుగులతో నాల్గవ స్థానంలో సి.కొత్తపల్లెకు చెందిన యాంకర్ సుబ్బారెడ్డి ఎద్లు 3705 అడుగులతో 5వ స్థానంలో, తలపనూరుకు చెందిన యాంకర్ శివమారుతిరెడ్డి ఎద్లు 3409 అడుగులతో 6వ స్థానంలో నిలిచాయి. వారికి నిర్వాహకులు వరుసగా రూ.30వేలు, రూ.25వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.8వేలు, రూ.5వేలు నగదు బహుమతులు అందజేశారు.


మాచిరెడ్డిపల్లెలో జరిగిన పోటీల్లో రాతి దూలాన్ని లాగుతున్న ఎద్లు

నకిలీ ట్రాన్స్‌జెండర్ పండుపై చర్యలు తీసుకోవాలి

- హిజ్రా ముసుగులో దందాలు నడిపిస్తున్నాడని ఆరోపణలు
- ఆంధ్రా, రాయలసీమ హిజ్రాల మధ్య తగవులు పెడుతున్నాడని ఆవేదన
- మదనపల్లెలో సమావేశమైన రాయలసీమ జిల్లాల ట్రాన్స్‌జెండర్ అసోసియేషన్ సభ్యులు

మదనపల్లె : ట్రాన్స్‌జెండర్ ముసుగులో హిజ్రా కమ్యూనిటీని తన ఆధిపత్యంలోకి తెచ్చుకుని, పెత్తనం చెలాయించేందుకు ప్రయత్నిస్తున్న నకిలీ ట్రాన్స్‌జెండర్ కాకినాడ పండుపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని రాయలసీమ జిల్లాల ట్రాన్స్‌జెండర్ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. అన్నమయ్య జిల్లా మదనపల్లె మండలం బసినికొండ పంచాయతీ హిజ్రాకాలనీలో మంగళవారం రాయలసీమ, నెల్లూరు జిల్లాకు చెందిన హిజ్రాలు పెద్దసంఖ్యలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో పోర్టులో కూలిగా పనిచేసుకుంటున్న కాకినాడ పండు అనే వ్యక్తి ఓ హిజ్రాను వివాహం చేసుకుని, అటుపై తాను హిజ్రానని చెప్పుకుంటూ దౌర్జన్యాలకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. ఈ సందర్భంగా రాయలసీమ ట్రాన్స్‌జెండర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు హాసినినాయక్ మాట్లాడుతూ...కాకినాడ పండు ట్రాన్స్‌జెండర్ల మధ్య ప్రాంతాలవారీగా విభేదాలు సృష్టిస్తూ, ఆంధ్రా, రాయలసీమ హిజ్రాల మధ్య చిచ్చు పెడుతున్నాడని ఆరోపించారు. సమావేశంలో నెల్లూరు జిల్లా ట్రాన్స్‌జెండర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు కావ్య, పెద్దలు సుజాతమ్మ నాయక్, చానమ్మ నాయక్, సుమ, షాకీరా, షబానా, సాయిరా, లైలా, ఉషా, అమరావతి, హేమ, అనూ, డాలీ, సల్మా పాల్గొన్నారు.


రాయలసీమ ట్రాన్స్‌జెండర్స్ అసోసియేషన్ సమావేశంలో మాట్లాడుతున అధ్యక్షురాలు హాసిని

దొంగతనం కేసులో ఇద్దరికి జైలు శిక్ష

కడప అర్బన్/చింతకొమ్మదిన్నె: కడప రూరల్ పరిధిలోని చింతకొమ్మదిన్నె పోలీస్‌స్టేషన్ పరిధిలో బుగ్గవంక డ్యామ్‌కు సంబంధించిన పైపుల దొంగతనం కేసులో ఇద్దరికి రెండేళ్ల జైలుశిక్షతో పాటు, ఒక్కొక్కరికి రూ. 10 వేలు చొప్పున జరిమానా విధించారు. ఈనేరానికి పాల్పడిన వారిలో కడప నగరం అక్కాయపల్లె, శాస్త్రినగర్‌కు చెందిన షేక్ రియాజ్ అలి యాస్ ప్లాస్టిక్ మస్తాన్, భగత్ సింగ్ నగర్‌కు చెందిన కొండూరు బాబు అలియాస్ సునీల్ ఉన్నారు. వీరిరువురిపై నేరం రుజువుకావడంతో సంబంధిత కోర్టు మెజిస్ట్రేట్ ఈమేరకు తీర్పునిచ్చారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో బోదకొట్టం దగ్ధం

ప్రొద్దుటూరు క్రైం : మండలంలోని పెద్దశెట్టిపల్లెలో రత్నావతికి చెందిన బోదకొట్టం మంగళవారం సాయంత్రం అగ్ని ప్రమాదానికి గురైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి వెళ్లి మంటలను అదుపు చేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం జరిగినట్లు అగ్నిమాపక అధికారులు తెలిపారు. సుమారు రూ. 40 వేలు నష్టం వాటిల్లినట్లు చెప్పారు.


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

విద్యుత్ తీగలు తగిలి వ్యక్తి మృతి

పెండ్లిమర్రి: మండలంలోని నందిమండలం గ్రామానికి చెందిన షేక్ ఖాజావలీ(57) అనే వ్యక్తి నందిమండలం గ్రామ పొలాల్లో మంగళవారం తెల్లవారుజామున విద్యుత్ తీగలు తగలడంతో మృతి చెందాడు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు ఖాజా వలీ కొండ కట్టెల కోసం మంగళవారం రాత్రి ఇంటి నుంచి బయలుదేరి వెళ్లాడు. పొలాల్లోకి పందులు వస్తాయని రైతులు రాత్రి పూట పొలం చుట్టు విద్యుత్ తీగలు లాగారు. గమనించకుండా వెళ్లిన ఖాజావలీ ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, కొడుకు, కుమార్తె ఉన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి తెలిపారు.


మృతి చెందిన ఖాజావలీ

శ్రీగంధం దుంగలు స్వాధీనం

సుండుపల్లె (వీరబల్లి): సానిపాయి రేంజ్, సానిపాయి సెక్షన్, జాంద్రపెంట బీటు పరిధిలో సోదాలు నిర్వహిస్తుండగా అక్రమ రవాణాకు సిద్ధంగా ఉంచిన శ్రీగంధం దుంగలను, డీలక్స్ బైక్‌ను స్వాధీనం చేసుకొని కోడూరు చెంద్రాయుడు అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు సానిపాయి రేంజ్ ఆఫీసర్ కె.పీరయ్య తెలిపారు. దుంగల బరువు 7.1 కేజీలు ఉంటుందన్నారు. మరో ముగ్గురు నిందితులు పారిపోయారని వారికోసం గాలింపు చర్యలు చేపట్టామన్నారు.


ఫారెస్టు అధికారుల అదుపులో శ్రీగంధం దుంగలు, నిందితుడు

షాపింగ్‌మాల్ దుకాణదారులకు నోటీసులు

సిద్దవటం : మండలంలోని ఉప్పరపల్లె గ్రామంలో జాతీయ రహదారి పక్కన నిర్మించిన షాపింగ్‌మాల్ యజమానులకు నోటీసులు జారీ చేసినట్లు తహసీల్దార్ శంకర్‌రావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పెద్దపల్లె రెవెన్యూ గ్రామంలోని సర్వే నంబర్ 936/ఎలోని ప్రభుత్వం స్థలంలో దుకాణాలు, షాపింగ్‌మాల్‌లు నిర్మించుకున్నారన్నారు. ప్రభుత్వ స్థలాలలో నివాస గృహాలు మాత్రమే నిర్మించుకోవాల్సి ఉందని, షాపింగ్ మాల్‌లను నిర్మించినందున ఆరోపణలు వచ్చాయన్నారు. ఈ నేపథ్యంలో షాపింగ్‌మాల్ యజమానులు ఐదుగురికి నోటీసులు జారీ చేశామన్నారు. వారు బుధవారం షాపింగ్‌మాల్ నిర్మాణాలకు సంబంధించి ధ్రువపత్రాలతో హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొన్నట్లు తహసీల్దారు తెలిపారు. కాగా, ఉప్పరపల్లె గ్రామంలో షాపింగ్ మాల్ నిర్మించుకునేందుకు సంబంధిత యజమానులకు గ్రామ పంచాయతీ తరఫున ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు.


మాట్లాడుతున్న తహసీల్దార్ శంకర్‌రావు